సాక్షి
ప్రకాశం

శనివారం । 4 । నవంబర్ । 2023



సమస్యల పరిష్కారమే ధ్యేయం

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని జేసీ శ్రీనివాసులు అన్నారు.

-10లో..



కొత్త ఆస్పత్రులకు అనుమతి తప్పనిసరి

కొత్త ఆస్పత్రులకు అనుమతులు తీసుకోవాలని డీఎంహెచ్‌వో అన్నారు.

-10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.9/25.1

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నకిలీ డాక్యుమెంట్ల కేసులో ఆరుగురి అరెస్ట్

ఒంగోలు, సబర్బన్: నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలు, నకిలీ రబ్బర్ స్టాంప్‌ల కేసులో శుక్రవారం రాత్రి ఆరుగురిని సిట్ అరెస్టు చేసింది. గతంలో ఒంగోలు తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసిన అధికారుల వద్ద అసిస్టెంట్‌లుగా పనిచేసిన ప్రైవేట్ వ్యక్తులు అక్రమాలకు పాల్పడినట్టు సిట్ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. ఆ దిశగా దర్యాప్తు చేసి కొల్లం ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఐదుగురిని అరెస్టు చేసింది. అరెస్టైన వారిలో వాయల బుజ్జమ్మ, ముప్పూరి భాగ్యలక్ష్మి అలియాస్ ముప్పిరి, మద్దినేని శ్రీనివాసబాబు, దూడల బ్రహ్మయ్య, పసుపులేటి గంగాధర్ ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కాగా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు అర్బన్: రాబోయే ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్ పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్, ఎస్పీలు ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సరిపడా సెక్టార్ ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్లు, బీఎల్‌ఓలు ఉన్నారన్నారు. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలు, బాపట్ల పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరిగాయన్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాకు సంబంధించి ఒంగోలు పార్లమెంట్‌తో పాటు 8 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వాటిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను నివేదించేందుకు తహసీల్దారు, ఎస్‌ఐలను బృందంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో సిబ్బందికి ఆరోగ్య సమస్యలు తలెత్తితే నగదు రహిత వైద్యం అందించేందుకు జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులను గుర్తించామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పర్యవేక్షణ, అక్రమంగా డబ్బు, మద్యం తరలింపును అడ్డుకునేందుకు చేపట్టే చర్యలను వివరించారు. అనంతరం ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఈఏఎస్ పరీక్షకు 35,467 మంది హాజరు

● పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్, డీఈవో సుబ్బారావు

ఒంగోలు సెంట్రల్: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్‌ఈఏఎస్) పరీక్షను శుక్రవారం జిల్లాలోని పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించే నిమిత్తం 3, 6, 9 తరగతుల విద్యార్థులకు మ్యాథ్స్, లాంగ్వేజెస్‌లలో ఈ పరీక్ష నిర్వహించారు. జిల్లాలో 39,607 మంది విద్యార్థులకుగానూ 35,467 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు డీఈఓ వీఎస్ సుబ్బారావు తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణకు 1,753 మంది ఫీల్డ్ ఇన్విజిలేటర్లు, 79 మంది మండల స్థాయి పరిశీలకులు పనిచేశారని వెల్లడించారు. ఒంగోలులోని బండ్లమిట్ట ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పరీక్ష జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట డీఈఓ సుబ్బారావు, ఎంఈఓ కిషోర్‌బాబు ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

ఒంగోలు సెంట్రల్: జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ సరస్వతి (ఎస్‌ఎస్‌ఎస్) విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు తమ భవిష్యత్ పట్ల స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. భవిష్యత్‌లో స్థిరపడాల్సిన రంగాన్ని నిర్ణయించుకుని అందుకు తగిన శ్రమ చేయాలని కోరారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఎవీ రమణా రెడ్డి, ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు, ఇస్మాయిల్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో కథనం అంతా డొల్లే..



- ఈనాడులో అవాస్తవాలతో వరుస కథనాలు
- 'కన్ను పడితే కబ్జాయే' అంటూ బాలినేని కుటుంబానికి అంటగట్టే కుట్ర
- బాలినేని సోదరుడి సివిల్ పంచాయితీని ఫోర్జరీ డాక్యుమెంట్లలోకి లాగే యత్నం
- డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావునూ ఇరికించే యత్నం
- అడ్డగోలుగా స్టాంపులు విక్రయించిన టీడీపీ నాయకురాలు వరలక్ష్మి ప్రస్తావనే కథనంలో లేని వైనం
- ఆమె మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు ప్రధాన అనుచరుల్లో ఒకరు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్టాంప్ వెండర్‌గా 11 సంవత్సరాలుగా కార్యకలాపాలు
- ఇప్పటి వరకు 1100కుపైగా విక్రయించినట్టు సిట్ దర్యాప్తులో వెల్లడి
- టీడీపీ నాయకులే నకిలీ డాక్యుమెంట్ల సృష్టికర్తలుగా అవతారం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రకాశం జిల్లా కేంద్రంగా నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ రబ్బరు స్టాంపుల కుంభకోణం టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే సాగుతుంటే.. ఎల్లో మీడియా మాత్రం ఆ నెపాన్ని అధికార వైఎస్సార్ సీపీపై వేసే ప్రయత్నాన్ని ముమ్మరం చేసింది. 'కన్నుపడితే కబ్జాయే' అనే శీర్షికతో 'ఈనాడు' మెయిన్ పేజీలో శుక్రవారం అసత్య కథనాన్ని వండి వార్చింది. ఈ కథనంలో నకిలీ డాక్యుమెంట్లకు ఎలాంటి సంబంధం లేని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబానికి అంటగట్టే కుయుక్తికి తెరతీసింది. అసలు ఈ కుంభకోణానికి కారణమైన దస్తావేజు పేపర్లు (స్టాంపు పేపర్లు) అడ్డగోలుగా విక్రయించిన టీడీపీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అనుచరురాలు పెరుంబూరు వరలక్ష్మి అలియాస్ మద్దిశెట్టి వరలక్ష్మి ప్రస్తావనే లేకుండా కథనాన్ని అల్లడం గమనార్హం.

ఈ కేసులో వరలక్ష్మి కీలకం...



మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో పెద్దిశెట్టి వరలక్ష్మి (ఫైల్)

నకిలీ డాక్యుమెంట్లకు, ఫోర్జరీ, నకిలీ స్టాంపుల కుంభకోణానికి ప్రధాన కారకురాలు స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన స్టాంపు వెండర్ పెరంబూరు వరలక్ష్మి అలియాస్ పెద్దిశెట్టి వరలక్ష్మి. ఈమె మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ముఖ్య అనుచరురాలు. ఆమెకు దస్తావేజుల విక్రయాల లైసెన్స్ ఇప్పించడం, దుకాణం ప్రారంభం అంతా ఆయన కనుసన్నల్లోనే జరిగిందని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. సిట్ విచారణలో ఇప్పటి వరకూ దాదాపు 1100 దస్తావేజులు నిబంధనలకు విరుద్ధంగా వరలక్ష్మి విక్రయించినట్లు తేలినట్లు సమాచారం. వరలక్ష్మి కోసం సిట్ బృందం ముమ్మరంగా గాలిస్తోంది. టీడీపీ నాయకుల సంరక్షణలోనే వరలక్ష్మి ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈనాడులో ప్రచురితమైన కథనంలో ఈమె ప్రస్తావనే లేకపోవడం గమనార్హం.

వేగంగా సిట్ దర్యాప్తు...

నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ డాక్యుమెంట్లు, నకిలీ స్టాంపుల కుంభకోణం వెలుగులోకి రావడంతో బాధితులకు న్యాయం చేయాలని బాలినేని శ్రీనివాసరెడ్డి జిల్లా ఎస్పీ మలికాగర్గ్‌ను కోరారు. కేసు దర్యాప్తులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని వెలుగుచూడటంతో సిట్ ఏర్పాటు చేయాలని కూడా అడిగారు. నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ డాక్యుమెంట్లు, నకిలీ స్టాంపుల వ్యవహారంలో టీడీపీ నాయకుల మూలాలు బయటపడటంతో ఆ పార్టీ నేతలు ఉలిక్కిపడ్డారు. ఇది తన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని భావించి బిత్తరపోయిన దామచర్ల.. నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారాన్ని అధికార వైఎస్సార్ సీపీతో పాటు బాలినేని శ్రీనివాసరెడ్డికి అంటగట్టే కుట్రలు పన్నారు. బాలినేని తనయుడిని కూడా ఈ రొంపిలోకి లాగే ప్రయత్నం చేశారు. అంతటితో ఆగకుండా టీడీపీ నేతలు, పచ్చమీడియా బాలినేని సోదరుడిపై కూడా అసత్య ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేసింది.

బ్యాంకు రుణం తీర్చకపోతే వేలం వేసిన భూములనూ నకిలీ దందాలోకి...



బాలినేని వేణుగోపాల్‌రెడ్డి

తాను చట్టబద్ధంగా భూమి కొనుగోలుచేస్తే అందుకు భిన్నంగా నేడు తనపై నిందలు మోపడం, దానిపై కనీస వివరణ తీసుకోకుండా వార్త ప్రచురించడం దారుణమని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సోదరుడు బాలినేని వేణుగోపాల్‌రెడ్డి ఈనాడుపై ధ్వజమెత్తారు. ఇటీవల వెలుగుచూసిన నకిలీ భూ దస్తావేజులకు సంబంధించిన అంశాలపై సిట్ ఏర్పాటు చేసిన తరుణంలో కొంతమంది దానిని కూడా దుర్వినియోగం చేసుకునేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. తాను ఆ భూమికి సంబంధించి చట్టబద్ధతను పూర్తిగా పరిశీలించుకున్నాకే కొనుగోలు చేశామన్నారు. ఇందుకు 13 సంవత్సరాల ఈసీ సాధారణంగా తీసుకుంటారని, కానీ, తాను 40 సంవత్సరాల ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్) తీసుకున్నానన్నారు. 2021 డిసెంబర్ 23న న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో, 2021 నవంబరులో ఆంధ్రజ్యోతిలో ఈ వేలం నోటీసులు వచ్చాయని చెప్పారు. తాను భూమి కొనుగోలుచేసే సమయంలో ఈసీలను పరిశీలించుకోవడమే కాకుండా చివరకు ఈనాడు పత్రికలో 2022 ఆగస్టులో ప్రకటన కూడా ఇచ్చానన్నారు. తాను భూమి కొనుగోలు చేయదలిచానని, ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కూడా కోరామన్నారు. కానీ, ఎవరి నుంచి ఎటువంటి అభ్యంతరాలూ వ్యక్తం కాలేదన్నారు. ఈ నేపథ్యంలోనే తాను చట్టబద్ధంగా భూమిని రిజిస్టర్ చేసుకున్నట్లు చెప్పారు. వాస్తవాలను రెండు రోజుల ముందే విలేకర్ల సమావేశం నిర్వహించి వివరించినా ఈనాడు కథనంలో తన ప్రస్తావన తేవడం సరికాదన్నారు. భూ కబ్జాలతో, రాజకీయాలతో సంబంధం లేని తనను ఈ రొంపిలోకి లాగడం సరైన పద్ధతి కాదని కూడా హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఆయన ఎస్పీ మలికాగర్గ్‌ను కలిసి తమ కుటుంబంపై అపప్రద కలిగే విధంగా కుట్రపన్నుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూడా ఫిర్యాదు చేశారు.

కోర్టు వివాదంలో ఉన్న భూమిలో వెలనాటిని లాగిన వైనం...



డిప్యూటి మేయర్ వెలనాటి మాదవ్

కోర్టు వివాదంలో ఉన్న భూమి విషయంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావును లాగి తన నైజాన్ని బయటపెట్టుకుంది ఎల్లోమీడియా. తద్వారా అధికార పార్టీపై బురదజల్లే పనిలో నిమగ్నమైంది. స్వయంగా టీడీపీ నాయకులే నేరుగా చెబుతుంటే.. వారి ప్రస్తావన మాత్రం మచ్చుకైన బయటపెట్టలేదు. మాధవరావు కార్పొరేటర్‌గా ఉన్న డివిజన్ కావడంతో రెండు వర్గాల మధ్య వివాదంలో ఉన్న ఆ భూమికి సంబంధించిన సర్వేని మున్సిపల్ సర్వేయర్ ద్వారా అధికారులతో మాట్లాడి చేయించారు. కానీ, రూ.10 కోట్ల భూమిపై డిప్యూటీ మేయర్ కన్ను అని ఎల్లో మీడియా కథనంలో ప్రచురించారు. 305వ సర్వే నంబర్‌లో 46 సెంట్ల అదనపు భూమికి వెంచర్ వేసి విక్రయించారు. అది ఆయా వర్గాల మధ్య వివాదంగా మారింది. దీంతో ఇరువర్గాలు కోర్టును ఆశ్రయించాయి. కోర్టులో ఉన్నదానికి ఒక వర్గం సిట్‌ను ఆశ్రయించింది. దాంతో నాకేంటి ప్రమేయమని వెలనాటి మాధవరావు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ నాయకులు కావాలని ఈనాడులో అసత్య కథనాలు రాయిస్తున్నారని మండిపడుతున్నారు. ఇదే ఈనాడులో ఇటీవల 'అనవసర విమర్శలు తగవు' అనే శీర్షికతో మాధవరావు ప్రకటనను కూడా ప్రచురించారు. కోర్టు వివాదాల్లో ఉన్న భూమి విషయంలో తనను ఏ విధంగా పావును చేస్తారని ప్రశ్నించారు.

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని పాతబస్టాండు ఆవరణలో ఈనెల 6వ తేదీ సాయంత్రం జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మార్కాపురం పట్టణ, మండల ప్రజా ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో యాత్రపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ యాత్రకు ఎంపీ విజయసాయిరెడ్డితోపాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారనీ ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త, పథకాల లబ్ధిదారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో 51 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ఘనత దేశంలో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఒక్క రూపాయి లంచం లేకుండా సంక్షేమ పథకాలను ఇంటివద్దకే తెప్పించారన్నారు. ఈ నాలుగున్నరేళ్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవే ప్రధానంగా భావించి.. అందరికీ న్యాయం చేశారన్నారు. సమాజంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు వివిధ పదవులిచ్చి సమాజంలో గౌరవ స్థానంలో నిలిపారన్నారు. సోమవారం సాయంత్రం 3.30 నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, అనంతరం బహిరంగ సభ ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బడుగు, బలహీన వర్గాల వారికి పెద్దపీట వేసిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. నాలుగున్నరేళ్లలో చేసిన ప్రగతిని ప్రజలకు వివరించడమే ప్రధాన లక్ష్యమన్నారు. నియోజకవర్గంలోని మార్కాపురంతోపాటు తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల నుంచి కూడా అందరూ హాజరుకావాలన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి సచివాలయం సమీపంలో జెండా ఎగురవేయాలని, అందుకోసం ఇప్పటి నుంచి జెండా దిమ్మెలను నిర్మించాలని పార్టీ నేతలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్‌లు ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ నారు బాపనరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్ కొండయ్య, పట్టణ, మండల జేసీఎస్ కన్వీనర్లు పీ రవిచంద్ర, పీ శ్రీనివాస రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ పీ కేశవరావు, పలువురు కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

రూట్‌మ్యాప్‌పై ఎమ్మెల్యే సమీక్ష:
ఈనెల 6వ తేదీన జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబంధించి రూట్‌మ్యాప్‌పై ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సీఐ భీమానాయక్, పట్టణ రూరల్ ఎస్సైలు కోటేశ్వరరావు, వెంకటేశ్వరనాయక్ తదితరులతో సమీక్షించారు. పలువురు మంత్రులు, ఎంపీలు వస్తున్న దృష్ట్యా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పాత బస్టాండులో యాత్ర బహిరంగ సభ జరుగుతుందని, అందుకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కేపీ సీఐ భీమానాయక్‌కు సూచించారు.

సామాజిక, సాధికార బస్సు యాత్రకు విస్తృత ప్రచారం

● కనిగిరిలో 8న బస్సు యాత్ర, బహిరంగ సభ

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక, సాధికార బస్సు యాత్ర ఈనెల 8న కనిగిరికి రానుంది. ఈమేరకు ఎమ్మెల్యే, ఎన్జీరంగా వర్సిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ప్రతి గ్రామం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా ఆయా మండలాల్లోని నాయకులు, ప్రజా ప్రతినిధులు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో నాయకులు గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి చేపట్టిన పథకాలను వివరిస్తున్నారు. పేద వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కలిగించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని, క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈనెల 8న బుధవారం ఉదయం 10 గంటలకు సామాజిక సాధికార బస్సు యాత్ర కనిగిరి నియోజకవర్గంలో ప్రారంభవుతుంది. సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని చర్చి సెంటర్‌లో బస్సు యాత్ర బహిరంగ సభ నిర్వహిస్తారని పార్టీ నాయకులు వెల్లడించారు. ఈమేరకు ప్రచార సాధనాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలతో, ఆటోల్లో విస్తృత ప్రచారం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నారు.



కనిగిరిలో ప్రచారానికి సిద్ధమైన బస్సు యాత్ర ఫ్లెక్సీల ఆటోలు

వైపాలెం మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా నాగమణి

త్రిపురాంతకం: యర్రగొండపాలెం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా సింగారెడ్డి నాగమణిని, వైస్ చైర్మన్‌గా కొర్రపోలు జయరావులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్రిపురాంతకం వైఎస్సార్ సీపీ కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి భార్య నాగమణి తరఫున ఉత్తర్వులు అందుకున్నారు. యర్రగొండపాలెం మార్కెట్‌యార్డు సభ్యులుగా హసవత్ హనిమీబాయి, కుక్కముడి మరియమ్మ, జడ్డా కుమారి, పల్లె సుస్మిత, బత్తుల గంగమ్మ, దూదేకుల కాశమ్మ, దుగ్గెంపూడి అంబమ్మ, పంది గంగరాజు, రేల వెంకట రమణ రెడ్డి, అల్లు రాంభూపాల్‌రెడ్డి, దోగిపర్తి సంతోష్ కుమార్, కొల్ల నారాయణమ్మ, దూదేకుల చిన్నమౌలాలి నూతన కమిటిలో ఉన్నారు. ఈమేరకు విజయవాడ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉత్తర్వులు అందుకున్నారు. కార్యక్రమంలో త్రిపురాంతకం ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్ సుశీల వెంకట పిచ్చయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మూర్తి రెడ్డి, పుల్లలచెరువు కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి, ఎంద్రపల్లి స్వామి, పబ్బిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న నాగమణికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



నాగమణి జయరావు

ఒంగోలు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పి.వెంకట జ్యోతిర్మయి శుక్రవారం సాయంత్రం ఒంగోలుకు వచ్చారు. ఈ మేరకు ఎన్‌ఎస్‌పీ అతిథి గృహంలో ఉన్న హైకోర్టు న్యాయమూర్తిని ఎస్పీ మలికాగర్గ్ మర్యాద పూర్వకంగా కలిశారు. న్యాయమూర్తికి పూల మొక్క ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన వారిలో జిల్లా న్యాయమూర్తులు కూడా ఉన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఎండీయూ వాహనం ధ్వంసం




ఎండీయూ వాహనాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ డీటీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు

ఒంగోలు అర్బన్: ఇంటింటికీ రేషన్ సరుకులు అందజేసే ఎండీయూ వాహనాన్ని గుర్తు తెలియని అగంతకులు ధ్వంసం చేసిన ఘటన నగరంలోని 6వ డివిజన్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎండీయూ ఆపరేటర్ పవిత్రన్ రేషన్ సరుకులు ఇంటింటికీ చేర్చి వాహనాన్ని గురువారం రాత్రి అక్కడి రేషన్ షాపు వద్ద నిలిపి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం రేషన్ పంపిణీ చేసేందుకు వాహనం వద్దకు వెళ్లగా వాహనం ధ్వంసం అయి కనిపించింది. దీంతో వెంటనే విజిలెన్స్ డీటీ కృష్ణమోహన్, ఫుడ్ఇన్‌స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసరావులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ఇద్దరు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని పరిశీలించారు. ఇంటింటికీ రేషన్ సరుకులు అందచేసే వాహనాన్ని ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. స్థానిక కార్పొరేటర్ తిరుమల కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. దీనిలో ఎండీయూ అసోసియేషన్ ఉద్యోగులు అరవింద్, ఇతర సభ్యులు నజీర్‌బాష, పున్నయ్య, సాయి, కిరణ్, ఇంతియాజ్, శివకృష్ణ, గణేష్, ప్రభుదాస్ కటారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్ల సేకరణకు రోడ్ షో

● ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో

ఒంగోలు సబర్బన్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు నగరంలో రోడ్ షో నిర్వహించారు. ఈ మేరకు డిపాజిట్ల సేకరణలో భాగంగా నగరంలోని ట్రంక్ రోడ్డుతో పాటు పలు ప్రధాన వీధుల్లో పర్యటించారు. రోడ్ షోలో బ్యాంక్ జనరల్ మేనేజర్ ఆర్.గిరి, రీజినల్ మేనేజర్ బి.హేమలత, చీఫ్ మేనేజర్ కామేశ్వర్‌తో పాటు ఒంగోలు పట్టణ బ్రాంచీల మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఆర్.గిరి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ ఇస్తున్న బ్యాంకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అన్నారు.



డిపాజిట్ల సేకరణ కోసం రోడ్డు షో నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు

రైతుల దాడిలో కొండచిలువ మృతి



దాడిలో చనిపోయిన కొండచిలువ

నాగులుప్పలపాడు: మండలంలో గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతమైన మద్దిరాలపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం కొండ చిలువ కలకలం సృష్టించింది. ఇళ్ల ఆవరణలోకి ప్రవేశించి గంప కింద ఉన్న కోళ్లను మింగిన అనంతరం కదల్లేక పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా.. సమీపంలోని రైతులు గమనించి దాడి చేశారు. ఈ దాడిలో కొండ చిలువ మృతి చెందింది. ఈ ప్రాంతంలో కొండ చిలువ కదలికలు గతంలో ఎప్పుడూ లేకపోవడంతో అసలు కొండచిలువ ఎక్కడి నుంచి వచ్చి ఉంటుందని ప్రజలు ఆశ్చర్యపోయారు.

● కలెక్టర్ దినేష్‌కుమార్

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు
- కొనకనమిట్లలో 'జగనన్నకు చెబుదాం'
- సమస్యలపై 189 అర్జీలు అందించిన ప్రజలు



సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

కొనకనమిట్ల: జగనన్నకు చెబుదాం ప్రత్యేక 'స్పందన' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు కృషి చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొనకనమిట్లలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్నీ గ్రామాల నుంచి ప్రజలు హాజరై అర్జీలు అందజేశారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా అధికారులతో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండల ప్రజల నుంచి మొత్తం 189 అర్జీలు అందాయని జేసీ వెల్లడించారు. అర్జీలపై విచారణ చేపట్టి వేగం సమస్యలు పరిష్కరిస్తామని జేసీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్, సీఈఓ బాలిరెడ్డి, డీపీఓ నారాయణరెడ్డి, డీఎల్‌డీఓ సాయికుమార్, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, హౌసింగ్ పీడీ పేరయ్య, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ షాజిదా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

మండలంలో సరైన వర్షాలు లేనందువలన ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన పలు రకాల పంటలు ఎండు ముఖం పట్టాయని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, రైతులను ఆదుకొనేందుకు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ జేసీ శ్రీనివాసులుకు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి వినతి పత్రం అందజేశారు. రెండు నెలలుగా సరైన వర్షం పడక పోవటంతో కంది, పత్తి, మినుము, అలసంద పంటలతో పాటు పలు రకాల కూరగాయల పంటలు నీరు లేక దెబ్బతిన్నాయని వివరించారు. ప్రజలు తాగునీటికి కూడా ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని జేసీని కోరారు.

కొత్త ఆస్పత్రులకు అనుమతి తప్పనిసరి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి



ప్రైవేటు వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి

ఒంగోలు టౌన్: కొత్తగా వైద్యశాలలు ఏర్పాటు చేసేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు తప్పనిసరిగా వైద్యారోగ్య శాఖ అనుమతి తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ప్రైవేటు వైద్యశాలలకు చెందిన వైద్యులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ రెన్యువల్ చేసుకునేందుకు పీసీపీఎన్‌డీటీ వెబ్ పోర్టల్‌లో అప్లోడ్ చేసుకోవాలని సూచించారు. స్కాన్ సెంటర్ల దరఖాస్తులు, రెన్యువల్స్‌కు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. పీసీపీఎన్‌డీటీ చట్టం నియమ నిబంధనల ప్రకారమే స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, రుసుములకు సంబంధించిన వివరాలను ప్రజలందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెంటర్లలో ఐఈసీ బోర్డులు, వైద్యుడి వివరాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. నియమ నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతిరోజూ నిర్వహించిన స్కానింగుల వివరాలను ఫాం ఎఫ్‌లో పొందుపరిచి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంఅండ్‌హెచ్‌ఓ స్పష్టం చేశారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ జాలాది మణిబాబు, డాక్టర్ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయ ఫ్రంట్ అవసరం

- బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



మీడియాతో మాట్లాడుతున్న శంకరరావు

ఒంగోలు: 2024లో బహుజన ప్రత్యామ్నాయ రాజకీయ ఫ్రంట్ ఏర్పడాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. శుక్రవారం ఒంగోలు వచ్చిన ఆయన.. స్థానిక హోటల్ సరోవర్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న రోజుల్లో తమ సంఘం రాజకీయ శక్తిగా మారబోతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సంఘాన్ని బలోపేతం చేసే క్రమంలో ఈ నెల 5న జిల్లా కార్యవర్గ సమావేశాన్ని స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని బీసీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర సమన్వయకర్త గోనుగుంట బ్రహ్మానందశర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల సాధనకు సమైక్య పోరు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మార్కాపురం టౌన్: కృష్ణా జలాల పునః పంపిణీపై కేవలం రాజకీయ కుట్రలో కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఇదే అమలైతే ఆంధ్ర ఎడారి ప్రాంతంగా మారుతుందని, గెజిట్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి సదస్సును స్థానిక పూలసుబ్బయ్య శాంతి భవన్‌లో శుక్రవారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య అధ్యక్షతన నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం నిత్యం కరువు కాటకాలతో ప్రజలు, రైతులు సతమతమవుతున్నారని, పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తితోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పశ్చిమ ప్రకాశానికి కృష్ణా జలాలు ఆశాజ్యోతిగా ఉన్నాయనీ, అయితే మోదీ ప్రభుత్వం కేవలం తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయ లబ్ధి కోసం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీచేశారని విమర్శించారు. ఈ గెజిట్ నోటిఫికేషన్‌తో వెలిగొండ ప్రాజెక్టుతోపాటు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ, నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాలు బీడు భూములుగా మారనున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించగా రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని కేటాయించారన్నారు. అయితే తెలంగాణ కేటాయించిన వాటికంటే ఎక్కువ నీటిని వినియోగించుకుంటున్నారని విమర్శించారు. మరోవైపు కర్నాటక రాష్ట్రం కూడా కృష్ణా జలాలను ఇష్టం వచ్చినట్లుగా వినియోగించుకుంటోందన్నారు. ఈ గెజిట్ నోటిఫికేషన్‌తో రాయలసీమతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలు శాశ్వతంగా ఎడారి ప్రాంతాలుగా మారనున్నాయన్నారు. కృష్ణా జలాలపై విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో విజయవాడలో నిరసన దీక్షలను చేపట్టనున్నట్లు రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, ఓబుల్‌రెడ్డి హాస్పిటల్ అధినేత కందుల గౌతమ్‌నాగిరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు జీ ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రైతు సంఘాల కమిటీ జిల్లా కన్వీనర్ రంగారావు, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, షేక్ సైదా, జావేద్ అన్వర్, ఎస్‌కె ఖాశీం, రైతులు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వస్త్ర ప్రియులకు 'శుభమస్తు'

- వైభవంగా శుభమస్తు షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాలినేని సతీమణి శచీదేవి
- వస్త్రప్రియులను హుషారెత్తించిన యాంకర్ శ్రీముఖి



మాల్ యజమానితో కలిసి వస్త్రాలు ప్రదర్శిస్తున్న యాంకర్ శ్రీముఖి



మహిళా విభాగాన్ని ప్రారంభిస్తున్న బాలినేని శచీదేవి, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: స్థానిక ఆర్టీసీ డిపో పక్కన శుభమస్తు షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బాలినేని సతీమణి బాలినేని శచీదేవి, యాంకర్ శ్రీముఖి షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని శచీదేవి మాట్లాడుతూ.. శుభమస్తు షాపింగ్ మాల్ వస్త్ర ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. యాంకర్ శ్రీముఖి మాట్లాడుతూ.. శుభమస్తు షాపింగ్ మాల్‌లో వినియోగదారుల అభిరుచులకు తగిన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరులో షోరూమ్‌లు ఉన్నాయని, ఒంగోలులో 6వ బ్రాంచ్ ప్రారంభించడం ఒంగోలు వాసుల అదృష్టమని చెప్పారు. షాపింగ్ మాల్ ఎండీ బయ్యా శ్రీనివాసులు, వెంకట రవికుమార్, శ్రీనివాస రాజా ప్రతాప్ మాట్లాడుతూ.. తమకు ఇప్పటి వరకు ఒంగోలుతో రక్త సంబంధం మాత్రమే ఉందని, ఇక నుంచి వ్యాపార బంధం కూడా ప్రారంభమైందన్నారు. ఈనెల 12వ తేదీ వరకు ప్రతి వెయ్యి రూపాయల వస్త్రాల కొనుగోలుపై రూ.100 విలువైన గిఫ్ట్ కూపన్ ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. గిఫ్ట్ కూపన్లను ఏడాదిలోగా ఎప్పుడైనా వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. సాధారణ, పట్టు చీరలు, కిడ్స్‌వేర్, మెన్స్, లేడీస్‌వేర్‌తో పాటు టెక్స్‌టైల్ ఆఫర్లు కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, దేవకి వెంకటేశ్వర్లు, వైవీ హనుమారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున హాజరైన వినియోగదారులను హుషారెత్తిస్తూ వేదికపై శ్రీముఖి నృత్యం చేస్తూ సందడి చేశారు.



షాపింగ్ మాల్ వద్ద సందడి చేస్తున్న యాంకర్ శ్రీముఖి

నన్ను కిడ్నాప్ చేశారు..
లేదు లేదు నన్నే మోసం చేశాడు!

- కిడ్నాప్ చేసి దాడి చేశారంటూ ఓ వ్యక్తి ఫిర్యాదు
- నకిలీ డాక్యుమెంట్లతో నమ్మించి రూ.70 లక్షలు స్వాహా చేశాడని వాపోయిన బాధితురాలు
- పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు

సింగరాయకొండ: జిల్లాలో నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారం ఓ వైపు కలకలం రేపుతుండగానే.. తాజాగా అలాంటిదే సింగరాయకొండలో ఒకటి వెలుగు చూసింది. సింగరాయకొండకు చెందిన గాలం శ్రీధర్ అనే వ్యక్తి ఓ మహిళకు నకిలీ దస్తావేజులు చూపి తక్కువ ధరకే భూమి కొనుగోలు చేయిస్తానని నమ్మించి ఏకంగా రూ.77 లక్షలకు పైగా నగదు తీసుకున్నాడు. ఆ తర్వాత మొహం చాటేశాడు. ఈ నేపథ్యంలో వారి మధ్య తలెత్తిన వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరింది. పోలీసుల కథనం మేరకు.. సింగరాయకొండలోని రైల్వేస్టేషన్ రోడ్డులో కోదండరామస్వామి దేవస్థానం సమీపంలో నివసిస్తున్న గాలం శ్రీధర్ స్థానికంగా బ్యాటరీ వర్క్స్‌తోపాటు రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. అతని ఇంటికి సమీపంలో నివసిస్తున్న అనంతరాజు శ్రీదేవి అనే మహిళ గత ఏడాది స్థలం కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు శ్రీధర్‌కు చెప్పడంతో తక్కువ ధరకే ఉన్నాయని నమ్మించాడు. పలు ప్రాంతాల్లో నాలుగు స్థలాలకు నకిలీ డాక్యుమెంట్లు చూపించి అగ్రిమెంట్‌పై ఆమెతో కొనుగోలు చేయించాడు. ప్రస్తుతం ఆ స్థలాలు వివాదంలో ఉన్నాయి. కొద్ది రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని, రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మించి ఆమె వద్ద నుంచి సుమారు 77,05,990 రూపాయలు తీసుకున్నాడు. నేటికీ సమస్య పరిష్కారం కాకపోగా శ్రీధర్ నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో చివరకు శ్రీదేవి తన డబ్బు తిరిగివ్వాలని ఒత్తిడి చేసింది. అయినా అతను కాలయాపన చేస్తుండటంతో విషయాన్ని బంధువులకు చెప్పి డబ్బు ఇప్పించాలని కోరింది. దీంతో శ్రీదేవి బంధువు తన ఇద్దరు స్నేహితులతో కలిసి శ్రీధర్‌ను డబ్బు అడగగా వారికి ఎదురుతిరిగాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి శ్రీధర్‌ను తమ కారులో ఎక్కించుకుని జాతీయ రహదారిపై కనుమళ్ల జంక్షన్ సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు తీసుకెళ్లి కర్రలతో చితకబాదారు. తనపై అనంతరాజు శ్రీదేవి బంధువులు దాడి చేశారని శ్రీధర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా శ్రీదేవి కూడా పోలీసులను ఆశ్రయించి తనను శ్రీధర్ నకిలీ డాక్యుమెంట్లతో ఏ విధంగా మోసం చేశాడో వివరించి ఆధారాలతో సహా ఫిర్యాదు చేసింది. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడతామని ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు. శ్రీధర్‌పై గతంలో రెండు ఎస్సీఎస్టీ కేసులు, పేకాట కేసు ఉన్నాయని చెప్పారు.

అర్ధరాత్రి పట్టుబడిన దొంగ



గ్రామస్తులకు పట్టుబడిన దొంగ సాయితేజ


కందుకూరు: ఓ ఇంట్లో దొంగతనానికి వచ్చిన ఓ దొంగ తప్పించుకునే క్రమంలో గ్రామస్తులకు దొరికిపోయాడు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి మున్సిపాలిటీ పరిధిలోని గనిగుంట గ్రామంలోని ఎస్టీ కాలనీలో చోటుచేసుకుంది. సింగరాయకొండ ప్రాంతానికి చెందిన ముగ్గురు దొంగలు గనిగుంటలో గురువారం రాత్రి దొంగతనానికి వెళ్లారు. పల్సర్‌బైక్‌పై వచ్చి బైక్‌ను గ్రామానికి కొంచెం దూరంలో పొలాల్లో పెట్టి కాలనీలోకి వచ్చారు. అనంతరం కాలనీలోని చేబ్రోలు సుబ్బారావు అనే వ్యక్తి ఇంట్లోకి ముగ్గురు చొరబడి, ఇంట్లోని ట్రంకు పెట్టెను అపహరించుకుపోయారు. దొంగతనం అనంతరం పారిపోయే క్రమంలో అలికిడి కావడంతో నిద్ర లేచిన సుబ్బారావుతో పాటు, మరికొందరు యువకులు దొంగల వెంటపడ్డారు. అయితే పెట్టెతో సహా ఇద్దరు తప్పించుకోగా, ఒక దొంగ మాత్రం గ్రామస్తులకు దొరికిపోయాడు. అలాగే వారు తీసుకొచ్చిన పల్సర్‌బైక్‌ను కాలనీవాసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ సాయితేజ, బైక్‌ను కాలనీవాసులు తీసుకొచ్చారు. దొంగను గ్రామంలోని రాత్రంతా చెట్టుకు కట్టి ఉంచారు. రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం గ్రామానికి వెళ్లిన పోలీసులు సాయితేజను అదుపులోకి తీసుకున్నారు. పారిపోయిన ఇద్దరు దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. అలాగే దొంగలు అపహరించుకుపోయిన పెట్టెలో దాదాపు రూ. 90వేల వరకు నగదు ఉన్నట్లు ఇంటి యజమాని సుబ్బారావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

యువకుడిపై దాడి కేసులో నలుగురు అరెస్ట్

కంచికచర్ల: ఇటీవల కంచికచర్లకు చెందిన యువకుడు కె.శ్యామ్‌కుమార్‌ను కారులో ఎక్కించుకుని ఆరుగురు వ్యక్తులు దాడి చేసిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు నందిగామ రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ శుక్రవారం రాత్రి తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు త్రిపురాంతకం మండలం గణపవరానికి చెందిన ఎస్.హరీష్‌తోపాటు నిందితులు జి.అనిల్, ఎస్.విష్ణు, బి.శ్రీకాంత్‌లను అరెస్ట్ చేసినట్లు వివరించారు. దాడికి పాల్పడిన ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామన్నారు. మిగిలిన ఇద్దరు నిందితులను కూడా అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు. కాగా బాధితుడికి న్యాయం చేయాలంటూ స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో దళిత సంఘాలు శుక్రవారం ఉదయం ఆందోళన చేశాయి. డీసీపీ మోకా సత్తిబాబు ఆందోళనకారులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

అదుపు తప్పి కారు బోల్తా

- కాశినాయన మండలం జెడ్పీటీసీకి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన సత్యనారాయణరెడ్డి

కంభం: కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో జెడ్పీటీసీ సభ్యుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కంభం మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. వైఎస్సార్ జిల్లా కాశినాయన మండల జెడ్పీటీసీ సభ్యుడు డి.సత్యనారాయణరెడ్డి తన కారులో విజయవాడ నుంచి స్వయంగా డ్రైవింగ్ చేసుకుంటూ స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో జంగంగుంట్ల గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణరెడ్డిని కంభం వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.